క్లుప్తంగా

కుట్టుమిషన్ల పంపిణీ



నర్సంపేట : పట్టణంలోని గోపీకృష్ణ ఇండస్ట్రీస్‌లో రోటరీ క్లబ్ స్థానిక డివిజన్ అధ్యక్షుడు యుగంధర ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద మహిళలకు క్లబ్ జిల్లా గవర్నర్ శరత్ చంద్ర చౌదరి కుట్టు మిషన్లు పంపిణీ చేసి మాట్లాడారు. మహిళలు ఆర్థిక స్వాలంభన సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ గార్లపాటి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ తోట వైద్యనాథ్, సెక్రటరీ అకినేపల్లి రాజశేఖర్, జిల్లా క్లబ్ సభ్యులు మోతె జైపాల్‌రెడ్డి, దేవునూరి అంజయ్య, బాదం రంజిత్, ఇరుకు కోటేశ్వర్‌రావు, సైఫ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాల ట్రిపుల్ ఈ విభాగ అధ్యాపకులు డాక్టర్ సింగిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, డాక్టర్ రాగిడి రణధీర్‌రెడ్డి, డాక్టర్ శరవణన్, లక్ష్మిప్రసన్న రచించిన 'ఫండమెంటల్స్ ఆఫ్ రెన్యూవబుల్ ఎనర్జీ రిసోర్సెస్' పుస్తకాన్ని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరిహరన్, విద్యాసంస్థల సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, ఏఓ సురేశ్, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు..

నర్సంపేట : తెలంగాణ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) గణతంత్ర దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'గణతంత్ర భారత్–జాగృత భారత్' సెమినార్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలలో బీజేఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తడిగొప్పుల మల్లేశ్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు.

పీడీఎస్‌యూ వాల్‌పోస్టర్లు..

ఖమ్మంలో ఈనెల 28న నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ విలీన సభల వాల్‌పోస్టర్లను ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ పట్టణంలోని ఎస్ఆర్ ఒకేషనల్ కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం అజయ్ మాట్లాడారు. పీడీఎస్‌యూ పీడిత విద్యార్థుల పక్షాన పోరాడుతోందని చెప్పారు. జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ఆశయ సాధనలో విడివిడిగా కొనసాగిన రెండు పీడీఎస్‌యూ సంస్థలను నేడు ఏకం చేస్తూ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేశ్, క్రాంతి, అఖిల్, నాని, సందీప్, సురేశ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ డ్రెస్ అందజేత

చెన్నారావుపేట : మండలంలోని లింగాపురం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు గ్రామానికి చెందిన కార్తికేయ ఇండస్ట్రీస్ యజమానులు విభూతి శివకుమార్, విభూతి సోమశేఖర్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ డ్రెస్, పుస్తకాలు, షూ అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. తాము చదువుకున్న పాఠశాల విద్యార్థులకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో రూ.45 వేలు వెచ్చించి డ్రెస్‌లు, పుస్తకాలు, షూ అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం జయశ్రీ, రోటరీ క్లబ్ గవర్నర్ శరత్ చంద్ర చౌదరి, అసిస్టెంట్ గవర్నర్ గార్లపాటి శ్రీనివాస్, తెలంగాణ ప్రాంతీయ కార్యదర్శి తోట వైద్యనాథ్, క్లబ్ నర్సంపేట అధ్యక్షుడు యుగేంధర్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

దుగ్గొండి : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పెసరు గంగాధర్ (40) శనివారం మృతి చెందాడు. ఈనెల 20న గంగాధర్‌ను భారత్ గ్యాస్ డెలివరీ ట్రాలీ వాహనం ఢీకొట్టగా చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం పరిస్థితి విషమిస్తుండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి గంగాధర్ మృతి చెందాడు. మృతుడికి భార్య కోమల, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చెన్నారావుపేట : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మగ్దుంపురం శివారులోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం వివరాల ప్రకారం.. కొత్తగూడ మండలంలోని కార్లాయికి చెందిన కొట్టం కుమారస్వామి చెన్నారావుపేట దిశగా ద్విచక్ర వాహనంపై వస్తుండగా నర్సంపేట మండలం ఇటుకాలపల్లికి చెందిన రంజిత్‌కుమార్ వాహనం ఒకదానికి మరొకటి ఢీకొన్నాయి. ఇద్దరినీ పోలీసులు 108 అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కుమారస్వామి పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మొగి' గుబులు.. రైతు దిగులు

- నాటు పచ్చబడక ముందే చనిపోతున్న పాదులు
- ఆందోళనలో అన్నదాతలు
- జాగ్రత్తలతో నివారణ : నాగభూషణం, ప్రధాన శాస్త్రవేత్త, ఆర్ఏఆర్ఎస్





చనిపోయిన వరి పాదులు

దుగ్గొండి : రైతన్నలు కోటి ఆశలతో వరి సాగు చేస్తారన్నది జగమెరిగిన సత్యం. వర్షాకాలం పెట్టుబడి ఎక్కువ కానుండడంతో అన్నదాతలకు పెద్దగా గిట్టుబాటు కాదు. యాసంగి వరి పంట కొంత లాభదాయకమని చెప్పవచ్చు. అయితే ఈసారి మునుపెన్నడూ లేనివిధంగా వరి నాట్లు వేసిన 10 రోజులకే పాదులు చనిపోతున్న దుస్థితి నెలకొంది. ఎరుపు రంగుకు మారి క్రమంగా వరిగడ్డిలా మారి చనిపోతున్నాయి. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే మండలంలో వేలాది ఎకరాల్లో నాట్లు వేయగా మిగితా పొలాలు నారు దశలో ఉన్నాయి. నాట్లు పూర్తి కాక ముందే మొదట వేసిన నాట్లు మొగి పురుగు సోకి చనిపోతున్నాయి. మండలవ్యాప్తంగా వందలాది ఎకరాలలో నాట్లు చనిపోయాయి. అయినా రైతన్నలు ఆశతో మళ్లీ దమ్ము చేసి నారు కొనుగోలు చేసి నాట్లు వేస్తున్నారు.

జాగ్రత్తలివే..

వరికోత మిషన్‌లతో వరి కోతలతో కొయ్యకాలు అరమీటరు ఎత్తుగా ఉండి దమ్ము చేసినప్పుడు కుళ్లిపోదు. అందువల్ల నత్రజని అందుబాటులోకి రాదు. ఫలితంగా మొక్క చనిపోయే ప్రమాదం ఉంది. సుమారు 20 రోజుల క్రితం చలి తీవ్రత పెరిగి 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదు కావడంతో చౌడుభూములలో మొక్కలు చనిపోతున్నాయి. చౌడు భూముల్లో నిరంతరం నీరు ఉంచితే నాటు బతుకుతుంది.

ఇటుక రంగులోకి మారడాన్ని గమనిస్తే జింక్ లోపంగా గుర్తించాలి. దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేయని పొలాల్లో సమస్య ఉంది. ప్రస్తుతం వరిలో లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి 5 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

చౌడు నేలల్లో ఈసారి వేరుకుళ్లు ఆశించింది. వేర్లు నల్లగా మారి భూమి నుంచి పోషకాలను గ్రహించలేకపోతుండడంతో వరి మొక్కలు చనిపోతున్నాయి. నివారణ కోసం పొలానికి నీరు పెట్టడం, ఆరబెట్టడం చేయాలి. పైపాటుగా 19–19–19, లేక 13–0–45 మందును లీటరు నీటికి 10 గ్రాములు చొప్పున కలిపి లేదా ఆగ్రోమిన్ మాక్స్ లీటరు నీటికి 5 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

తొలినాళ్లలోనే మొగి పురుగు ఉధృతి

వరి పంటలో న్నడూ లేనివిధంగా తొలినాళ్లలోనే మొగి పురుగులు ఆశించాయి. దీంతో వరిపాదులు ఎండిపోతున్నాయి. నివారణ కోసం నాటు వేసిన 15 రోజులలోపు ఎకరాకు 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేయాలి లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ మందు ఎకరాకు 400 గ్రాములు పిచికారీ చేయాలి లేదా కోరాజిన్ 60 మిల్లీమీటర్ల మందును ఎకరా పొలానికి పిచికారీ చేయాలి.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం



నర్సంపేట : క్రికెట్ విజేత జట్టుతో వెంకట్‌రెడ్డి, నాయకులు

- మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి

నర్సంపేట : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి బాటలు వేస్తాయని మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో యువ యూత్ సర్వాపురం ఆధ్వర్యంలో మునిగాల పద్మ మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా ఫైనల్‌లో కాజీపేటకు చెందిన సురేశ్ జట్టు మొదటి స్థానంలో నిలవగా రూ.60 వేల 116 నగదుతోపాటు షీల్డ్‌ను వెంకట్‌రెడ్డి, రెండో స్థానంలో నిలిచిన నర్సంపేట జట్టుకు రూ.30 వేల 116 నగదుతోపాటు షీల్డ్‌ను ఎల్లాగౌడ్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో క్రీడాపోటీల నిర్వాహకులు, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్, రామవరం మాజీ సర్పంచ్ కొడారి రవి, నాయకులు శీలం భానుప్రసాద్, మునిగాల రాజిరెడ్డి, దుబ్బాక నర్సింహారెడ్డి, పుట్టపాక దేవరాజ్, కొంకీస ముఖేశ్, తదితరులు పాల్గొన్నారు.

జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో..

నర్సంపేట రూరల్ : పట్టణంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో ఏబీవీపీ ఖేల్ భారత్ క్రీడోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సుభాశ్ చంద్రబోస్, స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. యువత క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ దేవేందర్, క్రీడాపోటీల జిల్లా ఇన్‌చార్జీ బెల్లం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



పర్వతగిరి : ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాజగోపాల్ వివరాలను మీడియాకు శనివారం వెల్లడించారు. మండలంలోని అన్నారం శివారులోని పెట్రోల్ పంప్ వద్ద శుక్రవారం ఎస్సై బోగం ప్రవీణ్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని అన్నారిగూడెంకు చెందిన మండవ సాయి, బొడబండ్లగూడెంకు చెందిన కూరపాటి ఎల్లయ్య ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. వారి వద్ద 2.65 కిలోల ఎండు గంజాయి లభించింది. పోలీసులు గంజాయితోపాటు రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఇద్దరినీ శనివారం రిమాండ్‌కు తరలించినట్టు సీఐ చెప్పారు.

పంచాయతీ కార్యదర్శికి బెదిరింపులు



రాయపర్తి : మండలంలోని వాంకుడోతుతండా పంచాయతీ కార్యదర్శి అభిలాష్‌ను తండాకు చెందిన వాంకుడోతు రవీందర్ శనివారం ఫోన్‌లో బెదిరింపులకు గురి చేశాడు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి అభిలాష్ తోటి కార్యదర్శులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అభిలాష్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఉదయం 9:17 గంటలకు రవీందర్ తనకు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషించాడని చెప్పారు. తనకు ప్రాణహాని ఉందన్నారు. ఘటనపై విచారణ చేపట్టి రవీందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు నర్సయ్య, వడ్డెపల్లి రాజు, మహేందర్, వల్లె వినోద్ కుమార్, తదితరులున్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : సంక్షేమ పథకాలు అమలు చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ సభల్లో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల, ఇతర పథకాల దరఖాస్తుదారుల పేర్లను మాత్రమే చదువుతున్నారని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టేలా నియోజకవర్గంలో 40 వేల మంది పేర్లను ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా సభల్లో ప్రకటించారని చెప్పారు. జాబితా సరైనది కాదంటూ సభల్లో ఎమ్మెల్యేను, అధికారులను ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే లబ్ధిదారుల జాబితా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పథకాలను అమలు చేయకుంటే మహిళలు కొంగు నడుముకు చుట్టి రోకలిబండలు చేతపట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు సూరబోయిన రాంబాబు, రాయపురపు సమ్మయ్య, తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి సుదర్శన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కోటిలింగాచారి, నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, సట్ల శ్రీనివాస్ గౌడ్, క్యాతం శ్రీనివాస్, గుగులోత్ సారయ్య, జన్ను జయరావు, చంద్రమౌళి, మోర్తాల రామారావు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

‘సీఎం రేవంత్‌కు లక్ష లేఖలు’

వర్ధన్నపేట : సీఎం రేవంత్‌రెడ్డికి లక్ష ఉత్తరాలు పంపిస్తున్నట్టు ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) మండల ఇన్‌చార్జ్ రొడ్డ మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని కడారిగూడెంలో ఆ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్ధన్నపేట మండలం నుంచి 3 వేల పోస్ట్‌కార్డులు పంపిస్తున్నట్టు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రార్థన సమయంలో భారత రాజ్యాంగ పీఠికను చదివించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బర్ల నగేశ్, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జ్ కంజర్ల రంజిత్‌కుమార్, నాయకులు పల్లెపాక చంద్రమౌళి, ఎల్లయ్య, సురేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యం

- ఆర్ఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌గాడ్గే

గీసుకొండ : బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తాను ఉద్యమిస్తున్నట్టు రజక రిజర్వేషన్ పోరాట సమితి (ఆర్ఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే తెలిపారు. బీసీ ఆజాదీ సైకిల్ యాత్ర మండలంలోని మచ్చాపూర్‌కు శనివారం చేరుకుంది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడారు. ‹మేం ఎంతో మాకు అంత› నినాదంతో బీసీలకు రాజ్యాధికారం సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తానని చెప్పారు. ఫిబ్రవరి 2న హన్మకొండలోని ఆర్ట్స్ కాలేజీ వద్ద నిర్వహించనున్న ఓరుగల్లు బీసీ మహాగర్జన యుద్ధభేరి మహాసభకు బీసీలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో యాత్ర కన్వీనర్ బత్తుల సిద్దేశ్వర్, ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొంగ వీరస్వామి, బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతం సతీశ్, ఆజాది అంబేడ్కర్ సంఘం నాయకుడు కొంగర నరహరి, మాదిగ దండోర రాష్ట్ర నాయకుడు కుంటి విజయ్‌కుమార్, తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు గుండవేణ స్వామి, తదితరులు పాల్గొన్నారు.


'రాజ్యాంగ ప్రాశస్త్య ప్రచారమే ధ్యేయం'



నివాళులర్పిస్తున్న అంబేడ్కర్, నాయకులు

నర్సంపేట రూరల్ : రాజ్యాంగ ప్రాశస్త్యాన్ని ప్రచారం చేయడమే ధ్యేయంగా బీజేపీ సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమం చేపట్టిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తనుగుల అంబేడ్కర్ తెలిపారు. ఆ కార్యక్రమంలో భాగంగా నర్సంపేట మండలంలోని నాగుర్లపల్లిలో ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి తనుగుల అంబేడ్కర్ పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని ప్రపంచంలోని దేశాలు కీర్తిస్తున్నాయని చెప్పారు. రాజ్యాంగం వల్ల అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతోందని తెలిపారు. ఈ క్రమంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగం యొక్క గొప్పతనాన్ని ప్రజలందరికీ వివరించేలా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మనీశ్, గంధం రాజు, అయితా కరుణాకర్, రమేశ్, విద్యాసాగర్, మిర్యాల హిట్లర్, తనుగుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



నల్లబెల్లి : లోవోల్టేజీ సమస్యతో పంటలు ఎండిపోయి నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోయారు. విద్యుత్ సరఫరాలో అవాంతరాలను తొలగిస్తూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మూడుచెక్కపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మూడుచెక్కలపల్లి, ఎర్రచెరువుతండా, లైన్ తండా, వేదనగర్, గోవిందపూర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. సబ్‌స్టేషన్ పరిధిలో లోవోల్టేజీ సమస్యతో విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు తరచూ కాలిపోతున్నాయని చెప్పారు. ఫలితంగా పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నర్సంపేట : మాట్లాడుతున్న ఆర్డీఓ ఉమారాణి



సంగెం : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా శనివారం జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా జరిగింది. సంగెం మండలంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నర్సంపేట పట్టణంలో ఆర్డీఓ ఉమారాణితోపాటు ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. అర్హులందరూ ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని చెప్పారు. ఓటును వజ్రాయుధంతో పోల్చారు. పర్వతగిరి, ఖానాపురం, దుగ్గొండి, చెన్నారావుపేట మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు, ఎంఈఓలు ప్రతిజ్ఞ చేయించారు. పలు చోట్ల విద్యార్థులు, గ్రామస్తులు వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు.



పర్వతగిరి : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



దుగ్గొండి : ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్

పారదర్శక పాలనకు ప్రాధాన్యం



సంగెం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి



ఖానాపురం : నాజీతండాలో..



చెన్నారావుపేట : అక్కల్‌చెడలో..

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్ : కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. సంగెం మండలంలోని వెంకటాపూర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నల్లబెల్లి, నెక్కొండ, చెన్నారావుపేట, దుగ్గొండి, సంగెం, గీసుకొండ, ఖానాపురం, పర్వతగిరి, రాయపర్తి, తదితర మండలాల్లో గ్రామ, వార్డు సభలు శనివారం ముగిశాయి. సంగెం మండలంలోని వెంకటాపూర్‌లో జరిగిన సభలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా చొరవ చూపుతోందని తెలిపారు. సభల్లో సంక్షేమ పథకాల అర్హులను ప్రజలే తేల్చుతారని చెప్పారు. సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడడం తన నైజం కాదని.. లుచ్చా ఎవరో ప్రజలే చెబుతారని మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డిపై పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. నల్లబెల్లి, ఖానాపురం, దుగ్గొండి, చెన్నారావుపేట మండలాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సభల్లో డీఆర్ఓ విజయలక్ష్మి, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కాపాడుకునేందుకే 'చల్లా' వ్యాఖ్యలు



గీసుకొండ : మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొమురారెడ్డి

గీసుకొండ : పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఉనికిని కాపాడుకునేందుకే ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితోపాటు నాయకులు, కార్యకర్తలపై వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారిపై మచ్చాపూర్ బస్టాండ్ సమీపంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కొమురారెడ్డి మాట్లాడారు. గతంలో అవినీతి, అక్రమాలకు పాల్పడి ప్రస్తుతం ఉనికి కోసమే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులపై బురదజల్లే పద్ధతి మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డికి హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, కూసం రమేశ్, దూల వెంకటేశ్వర్లు, పత్తిపాక రవీందర్, మంద రమేశ్, కూసూరి వీరభద్రం, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిపై ధర్మారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, జనగాం రమేశ్, నాయకులు మెట్టుపల్లి రమేశ్, అచ్చ నాగరాజు, రమేశ్ నాయక్, కిశోర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో లబ్ధి కోసమే సభలు

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

నర్సంపేట : గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తోందని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి 14 నెలలు గడచినా ఎన్నికల హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. వరంగల్ జిల్లాను రెండో రాజధానిగా గుర్తిస్తామన్న హామీ అమలుకు ఇప్పటివరకు కార్యాచరణ చేపట్టకపోవడాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. వార్డు సభల్లో లబ్ధిదారుల పేర్లు ప్రకటించకపోవడాన్ని ప్రభుత్వ మోసపూరిత విధానానికి ఉదాహరణగా చెప్పారు. ఇకనైనా ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే దిశగా చిత్తశుద్ధితో పని చేయాలని హితవు పలికారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, నాయకులు ఐతం నాగేశ్, పరిమల గోవర్ధన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లిలోని శ్రీదూడల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కోరారు. ఈ మేరకు గ్రామస్తులు దయాకర్‌రావును హనుమకొండలోని ఆయన నివాసంలో శనివారం కలిసి మాట్లాడారు. సమస్యలను వివరించారు. అనంతరం దయాకర్‌రావు మాట్లాడారు. మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి కోసం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ద్వారా రూ.10 లక్షలు ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు.